# అత్తగారూ - ఫామిలీప్లానింగ్



## భానుమతీరామకృష్ణ

అప్పుడే భోంచేసి హాల్లో కూర్చున్న నాకు మా అత్తగారు ఆకులు చీల్చి పొందానుతో సహా తెచ్చి ముందుంచారు...

"ఇదేమిటి ప్రతిసారి మీరు నాకు ఆకులు చీల్చి యివ్వడం పెద్దవారు!... అంటూ నేను యిదవుతూవుంటే "లేదు లేవే...దీనికి పెద్దా చిన్నా ఏమిటి... లేత తమలపాకులు చూడగానే నాకే నోరూరింది చెప్పద్దూ ... నే వేసుకునే అదృష్టంలేదు గదా అనీ నీకు చీల్చి తెచ్చాను యిందా వేసుకో యీరోజు శుక్రవారంగూడాను...నేను పెళ్ళయిన కొత్తల్లో ఏమిటీ మొన్న మొన్నటిదాకా మీ మామగారున్నప్పుడు రోజూ వేసుకున్నా వేసుకోకపోయినా శుక్రవారం నాడు మాత్రం తప్పకుండా వేసుకునే దాన్ని...అని ఆమె చెప్తూంటే నాకేం చేయాలో తోచలేదు ... తమలపాకులు వేసుకోడం నాకూ యిష్టమే. కాని నేను తమలపాకులు వేసుకుంటే పండ్లు పాడయిపోతాయని వాళ్లబ్బాయి కోప్పడతారు.. తమలపాకులు నములుతూ ఆయనగారి ముందుకు వెళ్ళడానికిలేదు. కోపంతో మాట్లాడరు...ముందు ఆ చెత్తంతా ఉమ్మి నోరు కడుక్కుని వచ్చి తర్వాత మాట్లాడమంటారు...అత్తగారేమో శుక్రవారం వేసుకోమని పట్టుబడతారు...

ఆరోజు ఆవిడ మర్చిపోయిందిగదా అని సంతోషించాను కాసేపు భోంచేశాక. కాని ఆవిడ శుక్రవారం మర్చిపోదు...ఏమిటే ఆలోచిస్తున్నావ్! ఆకులు వేసుకో... అన్నట్లు మన రెడ్డి చిలకలు ఎంత బాగా కడతాడనుకున్నావ్!...వుండు వాడిచేత రెండు చిలకలు కట్టిస్తా...ఒరేయ్ రౌడీ! ఏంచేస్తున్నావ్ రా మేడమీదా!...అంటూ కేకేశారు...రెడ్డి మావారి యొక్క నమ్మినబంటు...మూ డడుగుల ఎత్తులో ఎప్పుడూ పళ్ళు బయటవుంచి నవ్వు ముఖంతో చాల 'యాక్టివ్' గా ఉంటాడు. యజమానులైనా సరే వున్నమాట మొఖం మీద అనేస్తాడు రెడ్డి...అందుకే మా అత్తగారు రెడ్డిని రౌడీ అని పిలుస్తారు ముద్దుగా ...మా అత్తగారి పిలుపు రెడ్డికి వినిపించలేదు రేడియో వినిపించింది మేడమీద నుంచి రెడ్డి తెలుగు రికార్డులకోసం అవస్థపడుతున్నట్లున్నాడు...ఫామిలీ ప్లానింగ్ వినబడుతోంది. మా అత్తగారికి ఎక్కడాలేని చిర్రెత్తుకొచ్చింది...ఫామిలీ ప్లానింగ్ అంటే మా అత్తగారికి ఒళ్ళుమంట. ఆ విషయంమీద రెడ్డికీ ఆమెకీ చాలాసార్లు డిస్కషన్ నడిచి రెడ్డి చీవాట్లు తిన్నాడు. ...అప్పటికీ రేడియో సౌండ్ తగ్గించే పెట్టాడు...మా అత్తగారు లేచి మెట్ల దగ్గిరి కెళ్ళారు "ఒరేయ్ రౌడీ ముందా రేడియో ఆపేస్తావా లేదా! పాటాలేదు పద్యంలేదు ఆ దిక్కుమాలిన పిల్లల్ని కనొద్దనే ఘోష పెడతావ్ ... అని మా అత్తగారు కేకలేస్తూండగానే రెడ్డి గబగబ దిగి వచ్చాడు...'' అదికాదు పెద్దమ్మగారూ మరి ఆ గొడవంతా అయ్యాక తెలుగు రికార్డులొస్తై. మీకు తెలవదూ!

"ఆ ఒస్తయ్ ముష్టి మూడు రికార్డుల కోసం ముందు యీ ఘోషంతా వినడం




ఎందుకురా!...రెడ్డి ఒక్కనవ్వు నవ్వాడు మా అత్తగారి అమాయకత్వానికి.

"పెద్దమ్మగారూ .మీకు కోపంగానీ మరి దేశంలో దరిద్రం పెరిగిపోతావుంది గదమ్మా! ఒకోక్క తల్లి పదిమందిని కంటే ఎలాగమ్మా!

"ఎట్లమ్మా ఏమిట్రా నీ తలకాయ్ దేవుడిస్తే ఒద్దంటారా!...యీ రేడియో వాళ్లెవరు పుట్టేపిల్లల్ని ఆపడానికి!...

రెడ్డి మళ్ళీ ఫక్కున నవ్వేశాడు నోటికి చెయ్యి అడ్డుంచుకొని...

"రేడియోవాళ్లు కాదండమ్మగారూ! గవర్నమెంటోళ్ళు ప్రచారం చేయిస్తున్నారు రేడియోద్వారా...యింకా ఇళ్ళగ్గూడా వచ్చి చెప్తారు గదండీ."

"ఏమిటీ! సిగ్గువిడిచి యింటింటికీ గూడా వచ్చి యీ ఘోష వినిపిస్తున్నారా" శ్రీరామచంద్రా! భగవంతుడిచ్చే పిల్లల్ని పుట్టకూడదంటానికి వీళ్లెవరంట! గవర్నమెంట్ వాళ్ళంటే వాళ్ళ హద్దుల్లో వాళ్లుండాలగానీ మరీ రాను రాను యిళ్ళల్లో జొరబడి, ఇంతే తినండి. ఇంత మందినే కనండి అంటూ మొదలు బెడితే మనుషు లిక బతికేదెట్టాగుంట!...

రెడ్డి మళ్ళీ నవ్వుకున్నాడు.

"తప్పేంవుంది పెద్దమ్మగారూ! దేశం మంచికేగదా గవర్నమెంటోరు చేస్త!... తక్కువ పిల్లల్ని కని ఒచ్చే ఒరుంబడి సరి పెట్టుకోని సుకపడమనేగా వాళ్లు జెప్పేదీ! పిల్లల్ని దేవుడిస్తూన్నాడంటారే ఆ పిల్లల్నందర్నీ పెంచదగిన డబ్బొచ్చే ఉద్యోగాలు దేవుడిస్తున్నాడా చెప్పండి! యాభయిరూపాయిల వాడికీ ఎనిమిదిమంది పిల్లలు అయిదొందల ఉద్యోగస్తుడికీ ఎనిమంది పిల్లలు...యింకా తక్కువే అలాంటోళ్ళకి. అదే సిక్కు యిప్పుడు...

"ఒరేయ్ నారుపోసినవాడే నీరుపోస్తాడనే సామెతేవుందిరా! పెళ్ళీ పేరంటం లేని బెండకాయవి నీ కేం తెలుసురా."

ఉద్యోగాలు దేవుడివ్వకపోతే వూరు విడిచి వూరు ఉద్యోగంకోసం వెతుక్కుంటూ వచ్చినా నీకు యిక్కడ ఇంత తిండీ గుడ్డా ఎట్లా దొరుకుతుందిరా! నిన్నీ క్షణం బయటికి గెంటితే నీ గతేమిటి!...అంటూ సవాల్ చేశారు మా అత్తగారు.

"ఆ పని మీ వల్లగాదు పెద్దమ్మగారూ! ... ఎంటనే అయ్యగారు కారు పంపించి ఎక్కడున్నా నా కోసం ఎతికి రప్పిస్తారు...నాలాగా అయ్యగారి కాళ్లు పట్టేవాళ్ళని మీరు తీసుకురా లేర్లేండి... అన్నాడు రెడ్డి సగర్వంగా...

"అదేరా నీ గర్వం ... అందుకే రేడియో తిప్పికూర్చుంటున్నావా ...

"అయ్యో పెద్దమ్మగారూ మీతో పెద్ద లిటిక్లెషన్ గావుందే!...మీరేగదా మధ్యాన్నంశేళ పాటలు పెట్టమన్నారు! ...

"పాటలు పెట్టమన్నాగానీ రోజు ఆ గొడవంతా వినిపించమన్నావా." ...

"మరి 'ఫ్లామిలీ ఫ్లానింగ్' అయ్యాకే పాటలు నే నేటి సేసేది!...

ఏం చెయ్యద్దుగానీ రెండు చిలకలు

కట్టు...అని మా అత్తగారూ వాడి చేతి కొ్కన్ని తమలపాకు లిచ్చారు...

"అయ్యో పెద్దమ్మగారూ నాకేటి తెలుసు బెమ్మచారి గోడికి!"

"దీనికి పెళ్ళికావాలట్రా! ... ఏ కిళ్ళీ కొట్టు వాడిదగ్గరో నేర్చుకొనుంటావ్"...

"కరకట్టే పెద్దమ్మగారూ! ... మీ రన్నది కరకట్టే...మా యింటిదగ్గర కిళ్ళీ దుకాణం కిష్ట మాబాగ్గట్టేవాడు సిలకలు అంటూ రెండు చిలకలు చూడముచ్చ టగా కట్టి యిచ్చాడు...

నేను చిలకలు తీసుకుని నోట్లో వేసు కుంటూండగానే బయట టాక్సీ వచ్చి ఆగింది.

"ఎవరేవ్ యీ వేట్లప్పుడూ..." మన పరాకుంశం లాగున్నాడే ఆ దిగేదీ! ... అ...పరాంకుశమే! అంటూ మా అత్త గారు వరెండాలోకి వెళ్ళారు ...

పరాంకుశం బావగారు మా అత్త గారి అక్కకొడుకు భార్య రంగతోనూ మరదలు జానకితోనూ చంటిబడ్డ నెత్తు కుని టాక్సీదిగారు...

"ఏంరా యిదేనా రావడం" అంతా బాగున్నారా! అంటూ మా అత్తగారు కుశల ప్రశ్నలు వేస్తుంటే పరాంకుశం బావగారు ఆ బాగానేవున్నాం కక్కి... అంటూ నీరసంగా జవాబు చెప్పి టాక్సీ వాడికి డబ్బిచ్చేసి దిగండి త్వరగా! ... ఊ ... చూస్తా వేమ్మాయ్ దింపూ ... దానంతట అదిదిగదు ... రోగం సగం మొండి సగం...అన్నారు విసుక్కుంటూ మా అత్తగారు కారుదగ్గిరి కెళ్ళి రోగం ఏమిట్రా!...ఎవరికీ...అన్నారు.

"ఇంకెవరికీ" ... దానికే ... చస్తు న్నాము ... మొదట రైలు ఎక్కడానికి నానా అవస్థాపడ్డాం, తర్వాతా దిగడా నికీ, మళ్ళీ టాక్సీ ఎక్కరావడానికీ మొండి కెత్తుతోంది...ఊ...దిగూ అది టాక్సీ మన కారుకాదు ... అంటూ భార్యను కోప్పడుతున్న పరాకుంశం బావగారివేపు విషయం ఏమిటో తెలీని మా అత్తగారు అయోమయంగా చూస్తూ వుండి పోయారు...

అయినా పచ్చిబాలెంత నెలరోజుల గుడ్డును తీసుకొని యీ ప్రయాణం ఏమిట్రా! దిగవే రంగా లోపలికిరా ... అంటూ మా అత్తగారు కారుగగ్గిరికి వెళ్ళి నిలబడ్డారు ...

ఊహూ నేను దిగకు నన్ను మళ్ళీ ఊరికి తీసుకెళ్ళండి నా కేం పిచ్చిలేదు... నేను రాను ... రంగ మారాం చేయడం మొదలెట్టింది ...


"వూరికి తర్వాత వెళ్దువుగాని ముందు దిగు అంటూ రంగ రెక్కపట్టుకుని బల వంతంగా టాక్సీలోంచి దింపారు పరాం కుశం బావగారు.

వెనకాలే జానకికూడా దిగింది. రంగ ఎందుకు పేచీ పెడుతుందోయింకా అర్ధంగాని మా అత్తగారు నా వైపు ప్రశ్నార్ధంగా చూశారు. నా కంతకంటే అర్ధంగాక తెల్లముఖం వేసి చూస్తూ నిలబడ్డాను.


రంగను బలవంతంగా లోపలికి తీసు కొచ్చి సోఫాలో కూర్చోబెట్టారు. మా అత్తగారు పసిబిడ్డను పలకరించి రంగ కేం జబ్బురా అంటూ పరాంకుశంగార్ని నెమ్మ దిగా అడిగింది. ఆయన రంగ వినకుండా నెమ్మదిగా "ఒంట్లో రక్తం లేదట కక్కి యీ ఆరో కాన్పులో బ్లెడ్ ప్రెషర్ వేరే వచ్చింది దానికి... దాంతో మెంటల్ గా ఏదో డెలీరియంలాగా బట్టలు చించడం ఇట్లాంటి పిచ్చిపన్లు కాన్పుకాగానే మొద లెట్టింది. అసలు బ్రతుకుతుందనుకోలేదు లే...తర్వాతచెప్తా వింటే రచ్చచేస్తుంది" అన్నారు బిడ్డను జానకిచేతి కిస్తూ...

రంగ ఏడుస్తూ లోపల్లోపల గొణు క్కుంటూ బిడ్డ తనబిడ్డ కానట్టు ఆవేపు కూడా చూడకుండా కూర్చుంది...

"మా అత్తగారు కాస్త తేరుకుని అదేమిటే రంగా!...వస్తూనే వూరికెళ్ళ



డం ఏమిటే!...వాణ్ణెందుకట్లా అల్లాడ బెడతావే పాపం" అని మా అత్తగారు యింకా ఏమో మాట్లాడబోతూంటే రంగ గుడ్లు పెద్దవిచేసి మా అత్తగార్ని




మింగేట్లు చూసింది. వెలవెలబోతున్న మా అత్తగార్ని చూసి జానకి చెప్పింది. అక్కకి యీ ఆరో కాన్పులో చాలా పెద్ద జబ్బు చేసింది. ఆ వూరు డాక్టర్లు మద్రాసు పిల్చుకెళ్ళి పెద్ద డాక్టర్లకు చూపించమంటే పిల్చుకొచ్చాం...మా అత్తగారు ముక్కుమీద వేలేసుకుని "కాన్పుతో ఇట్లా కావడం ఏమిటే"... యీ విడ్డూరం నే నేక్కడా చూల్లేదు... మనిషే మారిపోయింది...ఇవేం రోగాలో కాలానికి తగ్గట్టే వున్నాయే!...అయితే యింతకీ యీ వూర్లో ఏ డాక్టర్లని చూడాలో విచారించావా!...అని అడిగారు మా అత్తగారు...

"ఆ అన్నీ విచారించే వచ్చాను. ఆయనెవరో డాక్టర్ అద్భుతం అట. యీ రోజే చూస్తాను రమ్మన్నాడు వెళ్ళాలి యిప్పుడు...

యిప్పుడేనా! వచ్చి పదినిమిషాలు కాలేదుగదరా, కాఫీ అయినా తీసుకోరా!... అని మా అత్తగారు అంటూంటే బాగా విసిగివున్న పరాంకుశం బావగారు "కాఫీ కేం లే కక్కి దానికి ఒళ్ళు నయం అయితేచాలు నెలరోజులుగా కంటిమీద కునుకులేదు దానికీ మాకూ కూడా...

"అయితే యిది బాలెంతజబ్బురా... దీన్నే గుర్రపువాతం అంటారు...

"ఆ గుర్రం లేదు గాడిదాలేదు కక్కి నరాలబలహీనత ... రక్తం లేకపోవడం ... మొత్తానికి ప్రారబ్ధం ... అంటూ రంగను డాక్టర్ దగ్గిరికి తీసుకెళ్ళేందుకు డాక్టర్‌కు టెలిఫోన్ చేయడానికి లేచారు పరాంకుశం బావగారు...

డాక్టర్ దగ్గిరికి వెళ్ళడానికి పేచీపెట్టి నానా గందరగోళం చేసిన రంగను బలవంతంగా కార్లో వేసుకొని తీసుకెళ్ళారు పరాంకుశం బావగారు...

డాక్టర్ దగ్గిర్నుంచి వస్తూనే రంగ చేసిన రచ్చకు మా అత్తగారు యిదేం రోగం యిదేం కథా!...అంటూ ముక్కుమీద వేలేసుకున్నారు...

పసిబిడ్డకు పాలివ్వడానికి ఒళ్ళోపడుకోబెడితే "నాకీ బిడ్డవద్దు" అంటూ తోపుతోసేసింది...చటుక్కున జానకి పట్టుకోకపోతే, బిడ్డా ఏమయ్యేదో!...

"నా కేం పిచ్చిలేదు.. నన్ను పిచ్చి డాక్టరుదగ్గిరికి తీసుకెళ్ళారు మీకేపిచ్చి... నన్ను వెంటనే వూరికి తీసుకెళ్ళండి... అంటూ నేలమీదపడి పొర్లి పొర్లి ఏడవడం మొదలెట్టింది...

పరాంకుశం బావగారు విసిగిపోయి ఏదో పుస్తకం తీసుకుని హాల్లో కూర్చున్నారు...

రంగచుట్టూ నేనూ, మా అత్తగారూ, జానకి నిలబడి రంగనెలా సమాధాన పర్చాలో తెలీక ఒకళ్ళ మొఖాలు ఒకళ్ళం చూస్తూ వుండిపోయాం...

"ఒసేవ్ రంగా, నా మాట వినవే! అనవసరంగా రచ్చచెయ్యకే!..ఏమిటే యీ అనాయ్యం" నోట్లో నాలిక లేని నువ్వేనాయిట్లా తయారయినావ్!..., చూడూ డాక్టర్ దగ్గిర మందులు తీసుకుంటే నువ్వు మళ్ళీ మామూలు రంగవవుతావే! నామాట విను...వరాం నీకోసం పడరానిపాట్లు పడుతున్నాడు పాపం... వాడు చెప్పినట్లు వినవే!...

నే విన్ను...నన్ను మోసంచేసి రైలెక్కించి యీ వూరు తీసుకొచ్చారు... నాకు పిచ్చని వూరంతా చెప్పారు... నా కేం పిచ్చిలేదు... నే వూరికెడతా నే యిప్పుడే వెడతా అంటూ చివాల్న లేచింది రంగ...జానకి చేతులో బిడ్డకు పాలుపడుతోంది, ఎదురుగావున్న నేను ఆపబోయాను...నన్ను ఒక్క తోపు తోసేసింది...పక్కనేవున్న మంచంమీద పడ్డాను...ఒక్క వూపున పోతున్న రంగాకు మా అత్తగారు అడ్డు నిలబడి "ఏమిటే నీ ఆగడం మరీనూ!...చూస్తూ వుంటే ముదిరిపోతూంది!...వూరి కెట్లా పోతావ్!... పోవడానికి వీల్లేదు... డాక్టర్ చెప్పందే నిన్ను పంపం...అని మా అత్తగారు అంటూండగానే ఆమె చెంప ఛెళ్ళుమన్నది!...

"ఆ దెబ్బకు ఆమె పక్కపళ్ళు లేవుగాని వుంటే వూడివుండేవి...నేను వెళ్ళి ఆమెను పట్టుకుని నెమ్మదిగా మంచంమీద కూర్చోపెట్టాను...

ఆ దెబ్బకు దిమ్మెరపోయిన మా అత్తగారు చెంపపట్టుకుని కాసేపు మాట్లాడకుండా పడుకున్నారు కండ్లు మూసుకుని...

రంగ నేరుగా హాల్లోకెళ్ళి పుస్తకం చూస్తున్న పరాంకుశం బావగార్ని ఒక్క కుదుపు కుదిపి "ఏయ్!...నన్ను వూరికి తీసుకెళ్తా లేదా! ... చెప్పు ... అంటూ అతని చేతులో పుస్తకంలాగి కింద పారేసింది...

ఆయన విసిగిపోయి జవాబు చెప్పకుండా తలబట్టుక్కూర్చున్నాడు ... చెప్తావా లేదా అంటూ మళ్ళీ సాధించడం మొదలెట్టింది...

"రేపు డాక్టరు మళ్ళీ రమ్మన్నాడుగా !...ఏ సంగతీ రేపు చెప్తానన్నాడు. మనం వుండాల్సిందీ వెళ్ళాల్సిందీ రేపు తేల్తుంది...ఆ తర్వాత వుంటావో వురిపెట్టుకుంటావో నీ యిష్టం అన్నాడు ...

"ఆ అదే నే చేయబోతున్నా...నన్ను తక్షణం వూరికి తీసుకెళ్ళకపోతే వురిపెట్టుకుంటా...అసలు నిన్నడగడం దేనికి నేనే స్టేషన్‌కి వెళ్తా"...అంటూ వరండాలోకి పరుగెత్తుతున్న రంగను పరాంకుశంబావగారు నాలుగుబాది లోపలకు యీడ్చుకొచ్చి రూములో పడేశారు... కిందపడి ఏడ్చి రచ్చచేసే రంగను చూసి మా అత్తగారు నోటమాటలేక చూస్తూ వుండిపోయారు...

అప్పుడే కూరలమార్కెట్టు కెళ్ళి వచ్చిన రెడ్డి జరిగిన విషయం అంతావిని మా అత్తగారిని చూట్టానికి గది వేపు వచ్చాడు...

"మా శా రా పెద్దమ్మగారూ!... పిల్లల్ని దేవుడిచ్చారంటిరే!...మరి యీ యమ్మగారికి యీ జబ్బేమిటి చెప్పండి! పాపం పెద్దోరూ మీ చెంప చెళ్ళుమనిపించారాయమ్మ...

అంతా ఒళ్ళుతెలీని కోపం ఒచ్చిందంటే ఆమెగారి ఒంటో రకతం లేదన్నమాట బలహీనం అదే ఆమె జబ్బు,.,వ్చ్... పాపం ఆ అయ్యగారు మాచెడ్డా మంచిమనిషిలాగున్నారు...బాగా యిసిగిపోయినాడు,




యింటికాడా పిల్లలూ, యీడా సేతులో పిల్లడు. భార్యకి పిచ్చి...

"ఒరేయ్! ఆ మాట దానిఎదట గట్టిగా అనవాక నీ పళ్ళు రాలిపోతాయ్ ... అన్నారు మా అత్తగారు మూలుగుతూ


రెడ్డి ఒక్క చిలకనవ్వునవ్వి "అవునండమ్మగారూ, మీకు పళ్లూ లేవ్వగనక బతికిపోయారు...లేకపోతే ఆ యమ్మ కొట్టిన దెబ్బకి ప్రాణం గడబట్టుంటాది...

"అవున్రా...కాస్త వేణ్ణీళ్ళ కాపటం పెట్టాల...దవడ శానానొప్పిగావుంది... అని ఆమె అంటూండగానే నేను హాట్ వాటర్ బేగ్ తీసుకెళ్ళి ఆమె చెంపకు చేరువలో వుంచాను.

"అప్పరే పెద్దమ్మగారూ 'అసలు యీ యమ్మగారికి యీ జబ్బు ఎలా వచ్చిందీ.'...

"ఏం ఖర్మో దాని సంగతి నన్నడవాక..." అంటూ విసుక్కున్నారు చెంప బాధతో. నేనే చెప్పాను రంగాకు జబ్బు ఎలా వచ్చిందీ... రెడ్డి ఒక్క నిట్టూర్పు విడిచి. "అందుకే పెద్దమ్మగారూ గవర్నమెంటోళ్ళూ ఎక్కువ పిల్లలొద్దని గోలెత్తుతున్నారు ... సూడండి! ఆమెని చూస్తే సిటికేనేలంత లేదు. ఆమెకి ఆరుగురు పిల్లల్ని కనీకనీ ఆమె ఒంటో రకతం లేదు...అందుకే యీ జబ్బొచ్చిందిపాపం.

"ఆ ఎత్తుభారం...మా కాలంలో కనలేదా పిల్లల్ని!...మా చెల్లెలికి పద్దాలుగు మంది పిల్లలు ... లక్షణంగా వుండేది ...




లేదు నాకు దూరానికి చూపానదు.

ఏమిటో కాలాన్ని బట్టి జబ్బులు...మనుషులూ అట్లాగే అర్భకు లవుతున్నారు అందుకే సిగ్గు విడిచి పిల్ల లొద్దంటున్నారు...పిదప కాలం...పిదప మనుషులు కన్నవాళ్ళందరూ రంగాలాగా తయారయ్యేట్లయితే యిక పిల్లలూ వద్దు పీచూవద్దు అనిపిస్తూంది ...

"కరకట్...పెద్దమ్మగారూ కరకట్ కానీ అసలు పిల్ల లొద్దనగూడదు ... గవర్నమెంటోళ్ళు సెప్పినట్టు ...

"ఒరేయ్ నీ గవర్నమెంటూ నువ్వూ ఏ గంగాలోనన్నా దిగండి...నా ప్రాణం విసిగించవాక...కావాలంటే నువ్వు పని మానేసి ఎంతమంది పిల్లల్ని కనాలో ప్రచారం చేసుకుంటూపో...అంటూ మా అత్తగారు మెల్లిగా దవడ ఆడించి "అబ్బా ఎంతదెబ్బ కొట్టిందే!...చూట్టానికి నరంలాగా వుందీ!"...అంటూ ఆమె బాధపడుతూంటే తోటవాడు పరుగెత్తుకొచ్చాడు.

"పెద్దమ్మగారూ 'పెద్దమ్మగారూ! మనదుర్గ దూడనెయ్యబోతావుంది..." అని చెప్పాడు ...

ఆ మాట వినేసరికి మా అత్తగారి చెంపనొప్పి ఎక్కడపోయిందో చివాల్న లేచి గొడ్లకొట్టంవేపు గబగబ నడవడం మొదలెట్టారు ...

రెడ్డి ముందే కొట్టంవేపు పరుగెత్తాడు.

దుర్గ కది నాలుగో యీత ... దాని మొదటిదూడకూడా దూడ నెయ్యడానికి సిద్దంగా వుంది ...

దుర్గ సాయంకాలం అయినా దూడ నెయ్యలేదు...దాని కష్టం చూసి మా అత్తగారు ... కంటతడిపెట్టారు అది దూడవేసిందాకా పచ్చి గంగ ముట్టుకోనని కూర్చున్నారు.

దుర్గ కనలేక మెలికలు తిరిగిపోయి బాధపడుతూ సొమ్మసిలిపోతోంది...గొడ్లవాడు మా అత్తగారితో చెప్పాడు పెద్ద గొడ్ల డాక్టరొస్తేగాని లాభంలేదనీ, లోపల గర్భసంచిలోనే ఏదో మిస్టేకనీ ...

ఆ మాట విన్న మా అత్తగారు ఖంగారు పడిపోతూ.

"ఒరేయ్ రెడ్డీ!...త్వరగా వెళ్ళి మన గొడ్ల డాక్టరుగారికి అర్జంటుగా టెల్లిఫోను చేసిచెప్పు మనదుర్గ ప్రొద్దుట్నుంచి కష్టపడుతూవుందీ, ఏం కారణమో మెలికలు తిరిగి బాధపడుతూవుంది ... దాని గర్భసంచిలో ఏం మిస్టేకో ఎంతకీ బయట పడనంటూంది ... వెంటనే బయల్దేరి రమ్మని చెప్పు ... పో పో. త్వరగా ... అంటూ ఆమె చెప్తూండగానే రెడ్డి పరుగు లంకించుకున్నాడు ...వుండబట్టలేక మా అత్తగారుకూడా వెనకాలే వచ్చారు ...

రెడ్డి నంబరుచూసి ఫోన్ చేశాడు

"హలో!...గొడ్లడాక్టర్ గారాండీ!...నేనేనండీ రెడ్డిని...మొన్న మీరు వళువుల్ని చూట్టానికొచ్చినప్పుడు టెంకాయ నీళ్ళిచ్చాను...ఆ సోమిరెడ్డినండీ...

"ఒరేయ్ నువ్వే రెడ్డివైతే ఎవరిక్కావాల్రా ముందు విషయం చెప్పు డాక్టర్ గారికి...

"అదే చెపుతున్నానండీ !...ఆయనకి నేనెవరో తెలీకపోతే ఆయ నింకో చోటికెళ్తే ఎలా !

"అందుకు నువ్వెక్కణ్ణుంచి చేస్తున్నావో చెప్పరా!...

"ఆయనడగందే!...నా పేరు చెప్పాను గదండీ!...డాక్టరుగారికి తెలిసుంటాది... డాక్టరుగారూ! మీరు ఎంటనే బయల్దేరి రావాలి...మా దుర్గ శానా కష్టంపడతా వుంది...

"దుర్గెవరా! ... మా గేదెండీ మా గేది...

"ఎందు క్కష్టపడతావుం దంటూరా! కన్లేకండీ...కానుపు కష్టం అంటున్నారు.

అదేదో గర్భసంచి బయటికి రావడం లేదంటుండి...మీరు ఎంటనే ఒచ్చేసి ఆ సంచేదో తీసి బయటెయ్యాలంటుండి...

మా అత్తగారికి శివంఎక్కింది...ఆమె నెత్తి కొట్టుకుంటూ.

“ఒరేయ్ త్రాష్టుడా! గర్భసంచి తీసి బయటెయ్యట మేమిట్రా !... అంటూ గట్టిగా అరిచారు...

“బలేవోరండి మీరూ!...మీతో సెడ్డ లిటిక్లేషనే! మీరే గదండి సెప్త! దాని గర్భసంచి ఏదో మిష్టేగ్గా వుందనీ! అదే చెప్పానూ!...

మా అత్తగారికి దవడనొప్పి ఎక్కువైంది...

నీ తెలివి తెల్లార్నట్లుంది...అయినా నీతో చెప్పడం నాదే పొరపాటు...నువ్వు చెప్పవే వివరంగా డాక్టర్ గారికి... అంటూ నాకు పురమాయించారు.

నేను ఫోన్ తీసుకుండేసరికి కట్ చేశారు డాక్టర్...

డాక్ట రొచ్చేసరికే దుర్గస్థితి విషమించింది...దానికి నిజంగానే గర్భసంచి తీసెయ్యాలనీ, లోపల దూడ బయటికి రావడం కష్టమనీ, ప్రొద్దుటే వస్తే తనే దైనా చేయగలిగేవాడనీ చాలా లేటయిందనీ చెప్పి ఆపరేషన్ చేసి గర్భసంచి తీసేసే ఏర్పాట్లు చేయడం మొదలెట్టాడు.




“ఒరేయ్ నువ్వు ఏ క్షణంలో ఆ డాక్టర్‌తో దాని గర్భసంచి తీసెయ్యమనే దిక్కుమాలిన కూత కూశావో పది కాలాలపాటు పది దూడల్ని వెయ్యాల్సిన దుర్గ యిట్లా అన్యాయం అయిపోయిందే” అంటూ మా అత్తగారు వాపోయారు.

“నేనేటి సేసేది పెద్దమ్మగారూ! మీరు చెప్పమన్నది సెప్పాను...మణుసుల్లాగే దానికీ ఫర్మనెంట్ ఫామిలీ ప్లానింగ్ అయిపోయింది” అంటూ పక్కకితిరిగి నవ్వాడు.